

# కళ - మానవజీవితము

నాట్యకళాప్రపూర్ణ శ్రీ టి. రాఘవాచారిగారు

[తిరువాంకూరు సంస్థానపు కళామహోత్సవముల సందర్భమున (1930) నవంబరు 19-వ తేదీ ప్రారంభమైన 6-వ కళాసమావేశమున కధ్యక్షత వహించిన సుప్రసిద్ధనాటకశేఖరులును, సుఖ్యాత కళారాధకులును, నాట్యకళాప్రపూర్ణ బిరుదాంకితులునైన శ్రీమాన్ తాడిపత్రి రాఘవాచార్యులవారు మానవుని విజ్ఞానాభివృద్ధికి కళ లెట్లు తోడ్పడు ననువిషయమును, రంగస్థల పాత్రములను నిర్మించును భావపూరిత మగు గంభీరోపన్యాసమును గావించిరి. అందు ముఖ్యముగ రంగమునుగూర్చి ఉపన్యాసభాగ మిది.]

వ్యక్తిజీవితమునను, సమష్టిజీవితమునను గూడ అన్ని సమస్యలను నిర్భయముగ నెదుర్కొనునదే ప్రాచీన భారతీయ కళలును, మతమునకును గూడ ఆశయములై యుండెను. హృదయ ప్రవృత్తిని అతి జాగ్రత్తగా పరిశీలించుచుండి దానిలోనికి ప్రవేశించి, సంపూర్ణముగ హృదయమును స్వాధీనపరచుకొని, నవ యాశయములతో దానిని ప్రతిధ్వనింపజేసి, యటుపై ప్రపంచమున కంతకును సాధ్యము లగునట్లు ఆ యాశయములను ఆచరణకు దెచ్చుటయే వానిపని. పుచ్చుకొన్న దానికంటె నెక్కువ యిచ్చుటయే జీవిత ప్రయోజనమై యుండెను. కాని యిట్లు చేయవలయు నన్నచో ఒకడు తనంతట తానే సృష్టి గావించుటకు సమర్థుడై యుండదగును. మానవ హృదయము సమగ్రముగ శిక్షణమునకు లోబడి యున్నప్పుడే యిట్టి నిర్మాణసామర్థ్యము సాధ్యమగును. ఇట్టి అసమగ్రజ్ఞానమగు హృదయము తన్ను తాను బయలుపరచుకొన వలయు నన్నచో కవిత్వము, సంగీతము లలితకళలు నందుకు సాధనములని చెప్పబడినది. ఈవిధముగ అత్యుత్తమమగు కవిత్వమును, సంగీతమును, కళను వెలువరచు హృదయముగూడ అత్యుత్తమ మగు పరిణతి గలదియై యుండదగును. ఈ నియమము ఒక వ్యక్తి విషయమున నెట్లో జాతి విషయమునగూడ



నాట్యకళాప్రపూర్ణ శ్రీ టి. రాఘవాచార్యులుగారు

వర్లే వర్తించెను. ఇట్టి నిన్నాశంకములగు నాశయములకు మనః ప్రవృత్తి విరుద్ధముగ నుండినచో అట్టి మనస్సునకు తగినంత పరిణతి లేదనియే మనవారెంచిరి. మతము భిన్నత్వములకు వెనుక నేకత్వమే యున్నదని బోధించెను. అట్టి యైక్యమును గ్రహించుకొనవలయు నన్నచో హృదయమును పూర్తిగ ప్రేమతో నింపవలసి యుండెను. ఈ ప్రేమకు మనుష్యుడు, పశువు అను భేదము లేదు. ఈసందర్భమున కళోపాసకునకు అతని కళయే తన హృదయ ప్రవృత్తిని వెల్లడించు చుండెడిది.

## నాటకరంగము-జీవితైక్యము

ఈ సిద్ధాంతమునే నాటకరంగమునకుగూడ వర్తింపచేసి చూడవచ్చును.

నాటకరంగములకు మరియొక విశేష మున్నది. ఇప్పుట నట, ప్రేక్షకుల యిద్దరి అపరిమిత హృదయములును, పరిణతి గాంచి, సమగ్రత నందుచున్నవి. 'యద్భావం తద్భవతి' అను లోకోక్తి సర్వసాధారణమైనది. ఇది వాస్తవమైనది కూడను. నాటకరంగమున నటుడొక్కడే తను భావించు కొనుచున్న రీతిగ పరిణమించుట లేదు. తన వ్యక్తిని పూర్తిగ నంతరింప జేసికొన్న త్యాగాగ్నిలో ప్రేక్షకులనుగూడ కరగించి తనతోపాటు కొనిపోవుచున్నాడు. ఏకాగ్రత గల కళారాధకుడు దృశ్యాదృశ్యములకు పరస్పరానుబంధము గలిగించు తన ప్రయత్నమున ప్రకృతిలోపలి యంశములను, ప్రకృత్యతీతములగు నంశములనుగూడ ప్రదర్శించుటకు సమానముగు స్పర్థతో ప్రయత్నించును. ఈ యాశయమును జేరుటకై ప్రకృతి సర్వస్వమును తానే యావరించి జీవిత సమస్యలన్నిటిలోను తానే కేంద్రస్థానము నాక్రమించుకొనును. అన్ని యనుభవములును తనకు గావలయునని యతడు ప్రయత్నించును. విలక్షణ స్వరూపమును, సలక్షణ స్వరూపమునుగూడ సమాన ప్రేమతో వీక్షించును. పాప పుణ్యము లతని కజ్ఞాన విజ్ఞానములు. అవిద్య విద్య, అపజయము జయము, కీర్తి అపకీర్తి, కరువు సమృద్ధి, దుఃఖము సుఖము, దురదృష్టము అదృష్టము, విరూపత్వము సురూపత్వము—ఈ యన్నిటిలోను తానే యై ప్రబోధము వడయుట కతడు ప్రయత్నించును. ఇట్టి ప్రయత్నముతో నతడొక "మహానుభావుడై" ప్రాణికోటి నంతను తన ప్రవాహములలో ముంచియెత్తు ప్రేమ జలధారను సాక్షాత్కరింప జేసికొనుటకు తన్ను సమర్థునొనర్చ నా దివ్యజ్యోతిని గోరి ప్రార్థించును. కళోపాసకునికి సర్వమును ప్రేమాస్పదమే. ఏలయన, ద్వేష మున్నచో భయ ముండును. భయ మున్న నజ్ఞానముగూడ కలదన్న మాటయే. అది మానవుని నిర్మాణశక్తిని చంపివైచి యతనిని మానవకోటి యభివృద్ధికి పాలలో నొక విషబిందువుగా జేసి వైచును.

## నటకుని ఆశయము

ఏకాగ్రతగల కళారాధకుడు—నటకుడు—రంగస్థలముమీదికి వచ్చునప్పో అధమపక్షము తన్ను తాను మఱచిపోవుటయును, ఇతరులు తమ్ము తాము గుర్తెరిగికొనునట్లు చేయుటయును మాత్రమైన అతని యుద్దేశమై యుండవలెను. అతనికి రంగస్థలమే ధ్యాన ప్రదేశము. అప్పుటనే యతడు పూర్ణుండై తన్ను తాను తెలిసికొనుటకును, ఇతరులను తెలిసి కొనుటకును గూడ ధ్యానమగ్నుడు కావలయును. ఒక మామూలు జపమునకు ఒక యేకాంత స్థానము, ఒక ప్రశాంతి, ఒక స్నానము, ఒక మడి—యిదంతయు కావలసియుండును కాని రంగస్థలముపై నటకుని జపమునకు కథాదేవత పరివార మంతయు పూర్తిగ నవసరము. అతని ధ్యానము అతని కొక్కనికే సంబంధించినది కాదు. తన్నుమాత్రమే కాక ప్రేక్షకవర్గము నంతను గూడ మనసులో నుంచుకొని యతడు ధ్యానము సాగింపవలసియుండును. అది యొక సమష్టి జపము. ఈ మహాసంఘములో ఎక్కువవారు తక్కువ వారు, చదివినవారు చదువనివారు, సంస్కృతి సంపన్నులు సంస్కృతి విహీనులు, అజ్ఞానులు జ్ఞానులు—ఇంతమంది యు గలిసియుందురు. ధ్యానప్రదేశమగు నాటకశాల పరిశుభ్రమై యుండి ధ్యాననిరతికి తోడ్పడునదిగా నుండవలయును. ఆవరణ మంతయు, ఎదుటి దృశ్యము లన్నియు, ధ్యానాస్పదమగు వస్తువుతో సమన్వయించి యుండదగును.

## నాటకరంగముపై తెరలు

ఒక పంటి ఖడ్గమృగమును జూచుచు శ్రీకృష్ణునిపై ధ్యాన ముంచవలెను. మదరాసు వీధిలో నున్న కిరసనాయిల్ టాంక్ బొమ్మలను తెరపై జూచి అదియే ద్వారకగ భావించుకొనవలసినదని నటకు నడుగుట యన్యాయము. శకుంతల విహారస్థానమున జనరల్ పోస్టాఫీసు గోపురమును రంగురంగులతో చిత్రించియుంచుట మనశ్శాంతికి భంగము కలిగింపక తప్పదు.

## సంగీతము

ఇంక సంగీత మన్నచో సంగీతము నిజముగ సంగీతమై యుండవలెను. రోగము గొన్న పిల్లి యరపు కాకూడదది. రంగస్థలముపై సంగీతములకు స్థానము లేదని యెంచువాడను కాను నేను. భావప్రదర్శనమే నటకునికి ప్రధానముగ చూచుకొనదగినది. సంగీతముమూలమున గాని ప్రస్ఫుటము గాజాలని భావములు కొన్ని యుండవచ్చును. ఆత్మను అత్యున్నతమగు స్థానమున జేర్పగల ప్రబలసాధనము సంగీతము. నిరంతర బాధాకరమగు అశాంతి నణచివైచి మనస్సును కాపాడ గలిగినది సంగీతము. సంగీత మన్నప్పుడు మంచిసంగీతమని నా యభిప్రాయము. సౌందర్యము నుత్తి మోత్తముగ వర్ణింపగల కవిలో సంగీత మున్నది. ప్రేమలలాటమునకు "కోహినూర్" వజ్రము సంగీతము. అంధకారమయ మగు నహంకారమును బంగారముగా మార్చి రసవాదజ్ఞాన కీయగల యద్భుతపు సాధనము సంగీతము. వ్యక్తి ఆత్మను అనంతత్వమునకు జేర్పగలిగినది సంగీతము. ధ్యానములో నున్నవానికి పట్టుమడి సంగీతము. పూజాస్థానమై యున్న నాటకరంగమునుండి సంగీతమును నేను దూర మొనర్పను. కాని రంగస్థలమునకు సరియైన సంగీతము నమర్చుటకు గొప్ప సంగీత శాస్త్రజ్ఞు డుండవలెను. అట్టివాడే నాటకమునను, రంగస్థలముపైనను గూడ సంగీతమునకు అర్హస్థాన మేదో నిర్ణయింప గలుగును. రసానుగుణ్యము, సమయానుకూలమునగు రాగము నతడే నిర్ణయింపగలడు దినచారమునకును, సంగీతమునకును సన్నిహిత సంబంధము గలదను సంగతి నెరిగినవారు చాల తక్కువమంది. ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము, రాత్రి వీని యన్నిటికిని గూడ ఆయా సమయములను మనోహరముగ వర్ణింపగల ప్రత్యేక రాగములు గలవు ఈ దినచారములో ప్రతిక్షణమునకును, ప్రతి నిమిషమునకును ప్రత్యేక లక్షణ ముండును. సంగీతము ఆయా సమయములతో మేళవించి యుండజాలక పోయినచో కళాభిజ్ఞుని విన్కి కది కఠోరముగనే యుండును. నాటకములో అనుకూలమగు సమయ మొకటి యున్నదను సంగతి నెరిగినవారు చాల తక్కువగ నుందురు. మామూలు నటకుడు నాటకము నంతయు పూర్తిగ చదివి అందలి ప్రతిరంగమునకును గల సమయ మర్యాదను గ్రహించుట కెన్నడును ప్రయత్నింపడు.

## నటకుని జ్ఞానశూన్యతకు ఫలితము

ఇట్టి యజ్ఞానమునకు గల ఫలితము మిక్కిలి పరిహాసాస్పద మైనది. ఉదయమున 7 ఘంటలవేళ ఒక రాజుగారు కొలువు తీర్చియున్నా రనుకొనుడు. కాని రంగస్థలముపై నప్పుడు శోభాయమానములగు చిత్రవిచిత్రములగు దీపములు! ఇంక నక్కడ నున్న మంత్రిగారు ఒక గొప్ప శత్రువు వచ్చి ముట్టడి సల్పిన వృత్తాంతమును కళ్లే లేని మధ్యమావతిరాగములో పద్యములోనో, పాటలోనో తెలియజెప్పును. ఇందుల కతనికి ప్రశంసలు. ఈనటకుల యజ్ఞానమును మించగలిగినది మరల ప్రేక్షకుల యజ్ఞాన మొక్కటియే. నటకు లొక్క రవ్వంత విచక్షణతో నాలోచించి యుండినచో ఉదయమప్పుడు దీపముల యవసర ముండదనియు, మధ్యమావతి కది సమయము కాదనియు బోధపడగలదు. నాటకముకళా సౌందర్యమునకు సంగీత మెక్కడెక్కడ వన్నె దెచ్చునను సంశయము నాలోచింతము. భక్తి, సంతోషము, ప్రేమ, దీర్ఘాలోచన—ఇవియన్నియు సంగీతమునకు స్థానమునీయ గలిగినవి గా నుండవచ్చును. కాని యేదో యొక మృగమును వేటాడు నాందోళనమున బడియున్నప్పుడు గాని, యుద్ధరంగమున శత్రువు నెదుర్కొను చున్నప్పుడు గాని, భైరవికి, కాంభోజికిని స్థానము లేదను విషయమున మీరు నాతో నేకీభవించెద రనుకొందును. వేటరంగములో

గాని, యుద్ధరంగములో గాని, పాట లెందుకు గావల యునో నాకు బోధపడుటలేదు. శత్రువులను నిర్మూలించుటకీ పాట లేమైన నుపయోగించునేమో నాకు తెలియదు. ఇట్టి సందర్భములో సంగీత మొకహంతకుని బోలియుండును. నాటకశాలలోని విమర్శకు డీమృత్యుసౌందర్యమునకు సులభముగ లోబడిపోవుచున్నాడు. నిజముగ సంగీతజ్ఞు డగువాడు ఇట్టి పొరపాటులను సులభముగా తప్పించుకొనవచ్చును.

ఇట్లు మంచినాటకరంగము, మంచి చుట్టుపట్లు, మంచి సాధనసంపత్తి, మంచి సంగీతము—వీని కన్నిటికని తోడు ఒక మంచి నాటకము, మంచి నటకుడు, మంచి విమర్శ—ఇవికూడ కావలసియుండును. ఇవి యన్నియు గలిసియున్నచో నప్పుడు మానవుని యంతర్బుద్ధికి ప్రబోధ మొసంగగల పవిత్రమగు నీసంస్థ (నాటకరంగము) పరమసుందరము కాగలదు.

## మంచినాటకము మంచినటకులను దెచ్చుకొనగలదు

కాబట్టి యిప్పుడు ప్రధానముగా కావలసినది మంచినాటకము. భోజనపదార్థములు సిద్ధముగా నున్నచో వడ్డించువారికిని, తినువారికిని లోటుండదని టాగూరుగారన్నట్లు, నాటకము మంచిదొకటి తయారైనచో నది తనంతట తానే మంచి నాటకరంగమును, నటకులను దెచ్చుకొనగలదు. ఈ మహాకార్యమునకై నిశ్చయముగ నిరంతర దీక్షతో పనిచేయుగల నాయకులగు స్త్రీపురుషులు బయలుదేరవలయును. (75 ఏండ్లు లోబడియున్న వారందరు యువకులే: నా శబ్దకోశములో ముసలితన మను మాటకు చోటు లేదు. స్త్రీలు సర్వదా యువతులే)

## నాటకముల యితివృత్తములు

దుర్బలమగు 'జో హుకుం'తత్త్వమును విడిచిపెట్టి నిర్భయముగ విశ్వామిత్రుని రీతి నూతనసృష్టి గావింపగల కవులు మన కిపుడు కావలయును. యుధిష్ఠిరునిచే స్వర్గద్వారమునగూడ సర్వజీవ సమత్వమును ప్రకటింపజేసి, తుకారామ్‌చే రొట్టె నెత్తుకొనిపోయిన కుక్కకు నేయికూడ నిప్పింపగలిగిన ప్రేమభావము నెరింగిన కవులు మనకు కావలయును. నూటుమంది భార్యలను గలిగియుండి నూటొక్కటవ భార్యనుగూడ పెండ్లియాడియామె కోరిక ననుసరించి యేకాదశీ వ్రతమునకై తన పుత్రులను వధింప సంసిద్ధుడగు మహానుభావులను నాయకులుగా జేయుని నాటకకారులు మనకు గావలయును. దుష్యంతులకు సంపూర్ణముగు ధిక్కారము జూపగల శకుంతలలను నిర్మించు నాటకకారులు కావలయును. వికెంతు రత్నశాలయములను స్థాపింపగల సావిత్రులను సృష్టించు కవులు గావలయును. మానవునకును మానవునకును మాత్రమే కాక మానవునకును ఈశ్వరునికిని గూడ గల సంబంధమును వెలిబుచ్చుచు, విద్యకు కేంద్రస్థానముగ నాటకరంగము నుండవలయుననుచు మన ప్రాచీనా శయమును ఆచరణలో బెట్టగల కవులు కావలయును

## భౌతికజీవితము - ఆధ్యాత్మిక జీవితము

నాటకము మనజీవిత మెట్లున్నదో యను సంగతిని, దానితోపాటు అది యెట్లుండవలెనో యను సంశయమును గూడ చిత్రింపవలసియుండును. ఒక పరిమాణౌచిత్యబుద్ధి లేక, తగు శిక్షణ లేక, అదృశ్యములు, నజ్ఞేయములు నగు సంశయముల గూర్చి ధ్యానించుచుండినచో, మన యెట్టయెదుటనే పైన మనకుండ వలసిన రసాంత యధికారమును సడలిపోయి, మన జీవితము పరస్పర సంబంధము లేని సంఘటనములతో నిండిపోవును. ఆధ్యాత్మిక జీవితమునకనవసరముగు ప్రాముఖ్యము నిచ్చినచో మానవజీవిత మొకమాఖ్యగ్రమములో పడిపోయి భౌతిక జీవితమునకునష్టము గలుగును. అట్టి ప్రాముఖ్యము భౌతిక జీవితము ఆధ్యాత్మిక జీవితరాజ్యమున ప్రవేశించు నాస్థానమున మానవుని దూరము చేసివైచును. సహజపరిస్థితులను బట్టియు, చుట్టుపట్లు గలిగిన మార్పులను బట్టియు అహంకార ధౌర్త్యము మూలమున మనము ప్రాచీనాశయమును పూర్తిగ మరచిపోయినాము. సృష్టికర్తను సృష్టినుండి, పరమేశ్వరుని మానవుని నుండి, తండ్రిని బిడ్డలనుండి వేరుపరచి యాలోచింప సాగినాము. కాబట్టియే మన నాటకరంగముల నన్నిటిని

దేవ దేవతలతో, పల్లీ పరిణయములతో నింపి వైచు చున్నాము. దేవతల ప్రేమలను, దేవతల దుఃఖములను చిత్రించు చున్నాము. సాధారణ జీవితమునకు సంబంధించిన యంశములు రంగస్థలమునకు అనర్హములని భావింపబడుచున్నవి.

## మానవజీవితము - నాటకము

ఈప్రవృత్తి యొంత శీఘ్రముగ మారిన నంత మంచిది. ఇటువైకవులకు, నాటకకారులకు పరమేశ్వరునికిని మానవునికిని మానవునికిని మానవునికిని గల సంబంధములను గూర్చి చర్చించుటయే యాశయమై యుండవలెను. మానవుల పరస్పర సంబంధమును గూర్చిన సమస్యలు పరిష్కారము గోరునవి వేలకు వేలుగా గలవు. నాటకరంగము విద్యాస్థానముగ నుండవలసినచో-విద్యాస్థానమే యది కేవలము-అస్పృశ్య జీవితమును చిత్రించుట కేగాని పనిరైయుండ రాదు. ప్రత్యక్షజీవిత సమస్యలను గూడ నది చిత్రింప వలసియుండును. ఒకవైపు సృష్టి జీవితమునకు సంబంధించిన ప్రాచీన విజ్ఞానాగులను బయల్పరచుచు, రెండవవైపునుండి వ్యక్తి జీవితమునకు గల ప్రాధాన్యమును, సంఘజీవితములో మేళవించి పోవునది యొనర్చు సహజ ప్రయత్నమును, మన సాంఘిక జీవితమును భిన్నము గావించుచున్న నేటి స్థితిగతులను గూడ నాటకము వెల్లడించుచుండవలెను. పైకి నాయకుడు ముందు మనచుట్టు నేమున్నదో మనము చూడవలసినదగును. ముందు దగ్గర నున్నదానిని గమనించి తరువాత దూరస్థమగుదానికి బోవలయును.

## జీవితము నున్న దున్నట్లు చిత్రించుట

శ్రీరాముడు రాజై రాజ్యమునకు సంబంధించిన సమస్యల నెట్లు పరిష్కరింప గలిగెనో తెలిసికొనుటకు మన మెక్కువ యుత్సాహము జూపవలయును. మనదృష్టి యచ్చటనే యుండవలెను. ముందు నాటకములు జీవితము నున్న దున్నట్లుగ చిత్రింపవగును. దీనినిబట్టి జనసామాన్యమున మనః ప్రబోధము కలుగును. సంపూర్ణమగు స్వభావము గలిగిన ఒకరి జీవితము జనసామాన్యమున కంతకు నాదర్శమై యుండునని చెప్పుదురు. మానవుడు సంపూర్ణత్వమును జెందవలయునని భావించు ప్రయత్నములను, వాని జయాపజయములను తెలిసికొన ప్రయత్నించుట మిక్కిలి ప్రబోధకరమైనది; మిక్కిలి ఉపయోగకరమైనది. ఒక గొప్పవాడు గావించిన స్వేచ్ఛావిహారము కన్న అతడట్టి గొప్పవా డెట్లయ్యెనను నంశము ఎక్కువ ఆకర్షకమైనది; ప్రబోధకరము, ఉపయోగకరము నైనది ప్రతి మానవునిలోను గొప్పశక్తులు గలవనియు, అందరును గొప్పవారగుటకు, సంపూర్ణత గాంచుటకు నవకాశ మున్నదనియు నిరూపించుట ఉత్తమోత్తమములగు ప్రబోధములలో నొకటి. విద్యకు ప్రధానాశయము మానవునిలోని దేవత్వమును బయల్పరచుటయే యని విజ్ఞులంగీకరించిన యంశము. ఇది కళలమూలముగనే సాధ్యమగును. అందును నాటకము ప్రధానసాధనము. ఆధునిక జీవితమునకు సంబంధించిన ప్రధానసమస్యలను అవి మానవ హృదయము నెట్లు పరిణమింప జేయుచున్నదియు, మానవునిలోని దేవత్వము నన్ని యాతంకములను, తొలగించునని యీసమస్యలను పరిష్కరించుట కెట్లు ప్రయత్నించుచున్నదియు నాటకములలో చిత్రితమై రంగస్థలమున ప్రదర్శింపబడవలెను. గొప్పవారు సాధారణ పరిస్థితులను ధిక్కరించి యున్నతముగ నిలిచిరి కావున నీ గొప్పవారు కాగలిగి రను నంశమును రంగస్థలముమీద నుండి స్పష్టము గావలయును. ఇట్టి సాధారణ పరిస్థితులకు కారణములైనవి సాధారణ జీవితములకు సంబంధించిన సమస్యలే. అందుచే మన నాటకకారులిక ముందు తమ దృష్టిని వాని వైపు మరల్పవలయును.

## ప్రబోధము కళకు గల యుద్దేశము కాదా?

కళకుగల యాశయము ప్రబోధము కాదను నభిప్రాయమును నే నంగీకరింపను. జీవితముయొక్క పరమాశయమే జ్ఞాన సంపాదనము. జీవితముయొక్క స్వయం ప్రకటనము కళ. నాటకరంగము లలితకళలన్నిటియొక్క మేళగింపు. అందుచే విద్యకు కేంద్రస్థానమది. చదువుల బడికన్న నెక్కువ యుపయోగకరమది. దేవాలయముకన్న ఎక్కువ శక్తిమంత మది.

## నాటకరంగము - మతవిద్య

మన ప్రస్తుత విద్యా విధానములో మత విద్య లేకుండుటచే అది లోపభూయిష్ఠమైనదని యీ నడుమ నెవరో యుపన్యసించుట నేను వింటిని. ఇది నిజమే. మానవుని నడవడియే అతని నిర్మాణ సామర్థ్యమున కాధారము. నిజమగు మత పరిజ్ఞానమే యిట్టి నడవడికి పునాది. మతమునకు విద్య స్థాన మీయనిచో అది నేతిబీరకాయ. ఏ మతమునకు గాని ప్రధానాశయములు రెండు: సర్వ సమత్వము, ప్రేమ. మతబోధకై మన విద్యాలయములలో ప్రయత్నములు జరుపుటలో గల కష్టములు మీకు తెలియును. శ్రీవైష్ణవులకు శ్రీవైష్ణవ గురువులు, అద్వైతులకు అద్వైతగురువులు, మాధ్వులకు మాధ్వగురువులు, ఈవిధముగ నెందరో కావలసియుండును. ఈ గడబిడ యంతయు విద్యాశాఖాధికారికి పిచ్చియెత్తించి వేయును. ఈ సందర్భములో నాటకరంగ ముపయోగింపగలదు. మన పూర్వౌన్నత్యమునకు దారిచూపిన మతవిషయ కార్యములను మనయెదుట బెట్టుటకు నిర్భయముగ నాటకరంగము ప్రయత్నింపవచ్చును. మన నాటకములు మన జీవిత సమస్యలనుగూర్చి చర్చించి, మనసంఘములకు భావి సౌభాగ్యమునకు దారిచూపవలయును. రాజకీయసమస్యలు, పరిపాలన సమస్యలు, సంఘ సంస్కార సమస్యలు, వేదాంతసమస్యలు, నివియన్నియు నాటకరంగము ద్వారా జనసామాన్యమునకు వెల్లడి కావలయును.

## కేవల సాధారణాంశములనే చిత్రింపనక్కరలేదు

జీవితము నున్నదున్నట్లుగ నాటక రంగముపై ప్రదర్శింప వలెననుటలో కేవల సాధారణములగు సంఘటనములను చిత్రింపవలయు ననునర్థము లేదు. ఏవో కొన్ని కొన్ని స్వభావముల స్థితినిగూర్చి మాత్రమే తెలియజేయు సంఘటనములవలని ప్రయోజన మంతగా నుండదు. మామూలు పరిస్థితులతో సమన్వయించుకొనిపోవు స్వభావముల స్థితినిగూర్చి మాత్రమే యవి మనకు తెలియజేయగలవు. కాని మానవుని ప్రయత్నబలమును, నిర్మాణ సామర్థ్యమును విశదపరచు జీవితసంఘటనములు గూడ కలవు. మానవునిలోని యీ నిర్మాణ సామర్థ్యమే, యీ ప్రయత్న బలమే యతనిని చుట్టుపట్లనున్న వాతావరణమునుండి పైకెత్తి యున్నత స్థానమున నుంచును. అందుచే మన ప్రాచీన జీవితమునకు గాని, వర్తమాన జీవితమునకుగాని సంబంధించిన యిట్టి సంఘటనములనే మన నాటకకారు లెత్తుకొనవలయును. క్రొత్త క్రొత్త కవులకు, నాటక కారులను గమనించి ఊరు, పేరు లేక తిరుగుచున్న యిట్టివారి కుత్సాహ మిచ్చి సరియగు నాశయములను వారియెదుట బెట్టి ఉపయోగకరములగు నాటకములను తయారు చేయించుట యిట్టి యుత్సవముల ప్రధాన కర్తవ్యమై యుండదగును.

## ఉత్తముడైన నటుడెవరు?

ప్రస్తుతము మనకుగల నాటకకళ యేస్థితిలో నున్నదో కొంచె మాలోచించి చూతము. కళకు, విద్యకు ఆవేశమే ఆధారమైనప్పుడు నాటకకళపట్ల ఈనియమము మరింత బలముగా వర్తించును. ఆవేశముగల నటుడే నిజముగ నటుడు. ఎట్టిభయమును లేక నిష్పక్షపాతముగ నే నీమాట చెప్పగలను. ఆష్లీ డ్యూక్గారన్నట్లు, ఒక నటుని శ్రేష్ఠత్వమును నిర్ణయించునది అతనివేషము గాదు, కంఠస్వరము గాదు, రంగస్థలవిహారము గాదు, భావసూచనయు గాదు, తుదకు ముఖముపై భావమును ప్రకటింప గలుగుటయు గూడ కాదు. అది వీని కన్నిటికిని పైనున్నది. మానవహృదయము తన పరిణామదశలో ఏదోయొక మెట్టు నందుకొని, నాకింకను జ్ఞానము ప్రసాదించి పైకి గొనిపొమ్మని ప్రార్థించు నవస్థను ప్రకటించుటయే యది. "నేను" "వాడు" కాగోరు ప్రయత్నములో నారంభదశ యిది. ఆత్మతిరస్కారము, ఆత్మవిస్తరణము క్రొత్తదారి బట్టుటకు—ఈదారి విలక్షణముగ గూడ నుండవచ్చును—ఇదియే ఆరంభ ప్రయత్నము. ఆత్మయహంకార బంధనముల విదళించుకొని విశ్వ ప్రేమ సముద్రమున దుముకుట కిది ప్రథమ ప్రయత్నము.

## నటకుడు - ప్రేమ

ఇట్టి మహాకార్యమునకు దిగుటకు ముందు ప్రేమను సంపాదించుకొనవలసి యుండును. మీ హృదయమును

ప్రేమ మయము గావించుకొనుడు. మీరు నటకులు కాగల్గుదురు. నాటకరంగముపై ప్రతిష్ఠ గడించుకొనగోరువారికిదియే నేనీయగల సలహా. శ్రీకృష్ణుడొకగొప్ప నటకుడు. ఆతని హృదయమున ప్రేమ తప్ప మరియొకటి లేకుండుటయే దీనికి కారణము.

## నేటి నట 'సింహములు'

కాని నేటి నటులను సులభముగ పట్టి యీయవచ్చును. చుట్ట యిలవా టొకటి, పెద్ద గొంతుక యొకటి వీరిలో చాలమందికి లక్షణముగా నున్నది. మన నట కోత్తములు సుబ్రహ్మణ్యులుగా వచ్చినను సరే, కర్ణులుగా వచ్చినను సరే, ఔరంగజేబులుగా వచ్చినను సరే, "జయజయ గోకులబాల" వారు పాడిన జాలను, మనకు పరమానందము. ఒక ఆఫీసులో గుమాస్తాపని గాని, ఒక బడిలో నుపాధ్యాయ పదవి కాని కావలెనన్న, దానికి యస్. యస్. యల్. సి. సర్టిఫికెట్టు, ఒక యోగ్యతా పత్రము ఇది యంతయు నవసరముండును. ఇంక నాటక రంగమునకు గావలసినది, ఒక పెద్దకంఠము, సిగరెట్లమీద తాంబూలముమీద గల విపరీతాభిలాష—ఇవి రెండును మాత్రమే.

ఇంక చాలమందికి బహుమాన పతకముల మాలల మీద, పత్రికలలో బొమ్మలు ప్రకటించుకొనుటమీద ఆశ. మనలోని నటసింహము లన్నియు గలిసి యొక ఆఫ్రికా యెడారిని పూర్తిగా నింపివేయగలవు. రంగ రత్నముల గుంపు ప్రపంచమున కంతకును చెందిన ఒక వజ్రకాలకు సరిపోవును. మొన్న నెప్పుడో ఒక జ్యోతిర్మార్తాండుని గూర్చి నేను చదివితిని. ఉత్తముడగు నటకుని సన్మానించి వెల్లడించు పద్ధతి యిది. ఈ బిరుదుల యుబలాటము ముఖ్యముగా ఆంధ్రదేశములో మరింత విపరీతముగా నున్నది. (ఈ నిరుపయోగమైయిన బిరుదుల మాలలే మనను బానిసతనమున గట్టివైచుచున్నవనియు, మనవారు వీనినుండి తప్పించుకొన్ననాడు స్వరాజ్యము లభింపగలదనియు నేనొకప్పుడు చెప్పుచుండువాడను.)

## నేటి నాటకసంఘములు - ప్రాచీనాశయములు

మన నటకులలో నాటకము నంతను పూర్తిగా చదివి యేపాత్ర కర్థ స్థానమేదో, పాత్రల పరస్పర సంబంధ మెట్టిదో తెలిసికొనుటకు ప్రయత్నించువా రెంతమంది కలరో యని నా సందేహము. ఈ సందర్భములలో ప్రొఫెషనల్ సంఘములకన్న అమెచ్యూర్ సంఘములవారి తప్పు పెద్దది. అమెచ్యూర్స్‌వారి బాధ్యత యెక్కువగా నుండుటయే దీనికి కారణము. దక్షిణ హిందూదేశములో అమెచ్యూర్ సంఘము లంతరించుట కెంతో కాలము పట్టదని నాయభిప్రాయము. ఏలయన, ప్రాచీన భారతీయ కళాశయములును, నేటి యీ సంఘముల యాశయములును ఒక్కటిగా నండుటలేదు. భిన్నత్వమునకు వెనక నున్న ఏకత్వమును నిరూపించుటయే ప్రాచీన కళకు ఆశయమై యుండ నేటి యీ సంఘములు భిన్నత్వము వంకకే దారి చూపుచున్నవి. మామూలుగా నీ ఆమెచ్యూర్ సంఘము లన్నియు నాటకరంగము నభివృద్ధికి దెచ్చుట, నాటక కళను పోషించుట యున్నగు ప్రయత్నము లొనర్చుట తమ యాశయము లని ప్రకటించుకొను చుండును. నాటకమును బట్టియే నాటకరంగ ముండును. కాని యీ సంగతి గమనించు వారెవ్వరును లేరు. సరియైన నాటకములను వ్రాయించు ప్రయత్నము లేవియు నగపడవు.

## నేటి నటకులు రంగస్థలముపై ప్రవర్తించువిధము

సాధారణముగా నాయికా నాయక పాత్రలను ధరించువారే ప్రదర్శనమునకు కావలసిన నాటకమును నిర్ణయింతురు. వీరి కెల్లప్పుడు తామే పైకి రావలయు నన్న ఆశ యొకటి యుండును. అటుపై పాత్రనిర్ధారణములో జాతిభేదములు. ఒకసారి నాయికా నాయకులైనవారు సర్వదా నాయికా నాయకులే. అప్పటనుండి వారు క్రిందికి దిగరు. ఇట్టి గౌరవము కావలెనను కోరిక యితరులకుగూడ నుండుట సహజము. వెంటనే యెక్కువ తక్కువల భావ మొకటి వెలికి వచ్చును. నిజముగా నిదియే మన యభివృద్ధి కాటంకము. ఇంతటితో సేవకులు

మున్నగు పాత్రల ధరించుట కందరును నిరాకరింతురు. ప్రతివారికిని రాచదుస్తు లవసరము. అటుపై స్థానేశ్వర యుద్ధములో భారత సామ్రాజ్యమును విచ్ఛిన్న మొనర్చిన పిశాచము (అంతః కలహములు) రంగస్థలమున నవతరించి నాయికా నాయకు లారంభించిన విధ్వంసకార్యము పూర్తియొనర్చును. అటుపై నాటకము నడపువారు నాయికా నాయకు లిద్దరు, వారి మిత్రులు కొందరు, కేవలము తటస్థులై యుండు హార్మోనియం మద్దెలవాండ్రు, ఏవో నిర్లక్ష్యముగా కాలక్షేపము చేయు రంగాధ్యక్షు డొకడు. ఈరోజులలో వీనికి తోడు సాంఘిక సమస్య యొకటి. ఇట్టి స్థితిలో, రాజకీయ రంగములో నలవరచు కొన్న స్వాతంత్ర్య భావములకు సమత్వ భావములకు లోబడి మన యువకులు నాయక పాత్రములకు వరుస వెంబడి నందరకు నియమలసి యుండునని తీర్మానములను సూచించు చుందురు. వీరి యభిప్రాయములో నాటకకళ యభివృద్ధియు, ఛాతీ పెద్ద దగుటయు నొకేరకమునకు చెందినవి. నిజమునకు సర్ జాన్స్టన్ ఫోర్బ్స్ రాబర్ట్సన్ గా రన్నట్లు, బోధించి నటుని తయారు చేయజాలము; నటుడు జన్మతః నటుడై యుండవలెను.

## అమెచ్యూర్, ప్రొఫెషనల్ సంఘముల సంబంధము

ఇట్టి యీ పరస్పర విరుద్ధములగు స్థితిగతులలో మేనేజిమెంటు సంఘమువారికి వేరు దారి యేమియు నుండదు. అందుచే నెవరో యొకరు సాధారణ సంఘమును సమావేశ పరుపవలెనని సూచింతురు. సాధారణ సమావేశమునకును గడబిడకును తప్పనిసరి యనుబంధము. ఆఖరుకు గట్టిగా మాట్లాడగలిగినవారు ప్రముఖులౌదురు. ఇంతే దీని ఫలితము. ఇట్లు కాక యేవైన కొన్ని ముఖ్యాంశములను గూర్చిన సూచనలు వచ్చినచో, నాయకుడు వెంటనే తప్పికొనుటయు, వెంటనే పోటీసంఘ మొకటి యేర్పరచుటయు సంభవించును. కడచిన 20 ఏండ్లనుండియు నేను నాలుగు పెద్దపెద్ద అమెచ్యూర్ సంఘములతో సంబంధము కలిగియుంటిని. ఇంచుమించుగా నెల్లప్పుడును ఈ సంఘముల స్థితి యొకేరీతిగ నున్నది. ఆరంభ మెంత యందముగ నుండునో ఆఖరు కది అంత యసంగతముగ నంతమొందును. ప్రొఫెషనల్ సంఘములలో వ్యాపించియున్న అర్థములేని వ్యవహారములను, నమ్మకములను అంతరింపజేసి రంగాభివృద్ధికి అమెచ్యూర్ సంఘము లెక్కువగా తోడుపడుచున్న మాట వాస్తవమే. ఒక గొప్ప యాదర్శము నవి నెలకొల్పుచున్నవి. కాని తమ కార్యమును నిరంతరముగ కొనసాగించు కొనుటకు దగిన నిర్మాణసాధనములు వానికి లేకున్నవి. ఇట్టి నిర్మాణ కార్యములలో ధనసంపత్తి ప్రధాన స్థానము నాక్రమించును. అమెచ్యూర్ సంఘములవారు వ్రాయించు క్రొత్త నాటకములు బాగుగ రచింపబడక పోవుటచే ప్రేక్షకుల నాకర్షింప లేకున్నవి. అందుచే వారి యుత్సాహ మంతయు చల్లారిపోవుచున్నది. ఇట్టి స్థితిలో కొన్ని సంఘము లసలే యంతరించి పోవుచున్నవి. మరికొన్ని పరల ప్రాత నాటకములను బట్టుకొని యెట్లో జీవితము నీడ్చుకొని వచ్చుచున్నవి.

అమెచ్యూర్ సంఘముల కే నిరంతరముగ నభిమానించుకొని యున్నంతకాల మిట్లే స్థితిగను లుండునని నా యభిప్రాయము. క్రొత్త క్రొత్త పోకడలకు దారి చూపుట అమెచ్యూర్ సంఘములవారికిని, వారి యీ కార్యమును తమకు గల కట్టుబాట్ల సహాయముతోను, సాధనసంపత్తి సహాయముతోను బలపరచి స్థిరపరచుట ప్రొఫెషనల్ సంఘములవారికిని పనియై యుండవలెనని నా యభిప్రాయము. ఈ మహాకార్యమున ఈ రెండు సంఘములవారికిని పరస్పర సాహాయ్యము, సామరస్యము నేర్పడవలెను. అమెచ్యూరు సంఘములవారు పైసంఘములలోని సుగుణమును కనిపెట్టియుండి అట్టిదానికి సహాయము చేయుచుండదగును.

## నాటకరంగము : పత్రికలు

ఈ సందర్భమున బాధ్యత పత్రికలకుగూడ కలదు. కళా విమర్శకులు హృదయపూర్వకముగ నీ విషయమున నభిరుచి గలిగించుకొని, ప్రజలలో ప్రబోధము గలిగించుటకు తోడుపడవలెను.

నటకులనుబట్టి ప్రేక్షకులు, అట్లే ప్రేక్షకులను బట్టి నటకులు నేర్పడుదురు. మంచి నాటకములను ప్రదర్శించి ప్రేక్షకులు వాని నామోదించునట్లు చేయుట నటకునిపని. ఇట్టి యామోదము లేకపోయినచో నటకుని కార్యోత్సాహము క్షీణించును. సరుకు మంచిదైనచో కొనువారి కేమియు లోటుండదు. అట్లే తమ యాదర్శములను దీక్షతో నంటిపెట్టుకొనియుండి కార్యమునకు గడంగినచో మంచినటకులును, మంచినాటకమును కేవల సంకుచితాభిప్రాయులగు ప్రేక్షకులనుండి కూడ నామోదము బడయగలరని నేను చెప్పగలను. సాధారణముగా మానవ స్వభావము అపజయముచే కలతనొందక యుండజాలదు. క్రొత్త నాటకమును, క్రొత్త యాదర్శమును అంటిపెట్టుకొని యుండగోరువాడు ధనాభావమును దాటి బ్రతుకలేకున్నాడు. అతనుపక్షమతనిని వెనుకనుండి ప్రోత్సహించి సంతోషము గలుగజేయు వారైనన్నచో తనజీవితము నతడు నిలుపుకొనగలడు. కళా సంస్థల కార్యక్రమమునకు ప్రేక్షకులు లేని లోపము భంగకరముగా నున్నది.

ఇది యెట్లున్నను దీని కెక్కువ నష్టము పత్రికలయుపేక్ష. వ్యక్తుల కెట్లో యట్లే పత్రికలకుగూడ కీర్తికాంక్షలపై నాశ. అందుచే కీర్తికాంక్షనుదారముగ పంచిపెట్టగలుగువానికి పత్రికలలో ననుకూలమగు స్థానము లభించును. ఈవిధముగ ద్రవ్యము కడనే తోడే లోకటి యెదుర్కొనుటచే కళా సంస్థలు తుదకు ఆకున కందని, పాకకు పొందని యీపత్రికల విశేషణముల మూలమున తమ యుత్సాహము నంతయు గోల్పోయి పూర్తిగ నంతరించి పోవుటయో, పేకాటలోనికో పత్రికా పతనములోనికో దిగుటయో సంభవించుచున్నది. పత్రికలు తమ బాధ్యతను నిర్భయముగ నిర్వహింప వలసినదని నేను కోరుచున్నాను. భారతీయ కళాదర్శములు, ధర్మాదర్శములు, కవిత్వాదర్శములు, వీనిలోగల ప్రతిష్ఠయే భారతదేశమునకు గల ప్రతిష్ఠ. ప్రాచీనాశయములను వానిచుట్టును పెరిగిన డొంకలనుండి తప్పించి శుభ్రపరుపగల కార్యము పత్రికలే జయప్రదముగ నిర్వహింపగలుగును. మన కళా జీవితమును, అన్య జీవితభాగములను గూడ క్రుంచివైచుచున్న యాదుర్వస్తువును ప్రత్యక్షీకరించి, మన మనుసరించుచున్న దురాదర్శములను మనకు బయల్పరుప గలవి పత్రికలే. నిర్దాక్షిణ్యములగు నాచారములను, భయావిష్టములగు మూఢ విశ్వాసములను అణచివేయవలెను. విధ్వంస కార్యముగూడ అభివృద్ధి కొక సాధనమే. అభివృద్ధికిగల యాటంకములను నిర్ణయముగ నిర్మూలించి వేయుదగును. పత్రికలు మన కీ యమూల్య సహాయము నీయగలవు.

## జనసామాన్యము సంస్కరణమునకు విముఖమా?

జనసామాన్యములో సరియైన యభిప్రాయములను, అభిరుచులను గల్పించు టెట్లను ప్రశ్న రావచ్చును కాని నిజమునకు మన యభివృద్ధి కాటంకముగ నున్నవారు—రాజకీయముగ గానిండు, సాంఘికముగ గానిండు, కళా విషయముల గానిండు,—నగుపుకొన్నవార మనుకొను సగము సగ మెరిగినవారే కాని పామరజనము గాదు. ఆపంబ్రపిరము లోకకొందరు బయలుదేరి వారిని పెడదారికి బెట్టకున్నచో, ఏ మంచియాదర్శమునైన సరే సరళముగ వారి యెదుట నుంచినప్పుడు 'పామరజనులు' హృదయపూర్వకముగ దానిని ప్రశంసింతురు. అందుచే ముందుగా నీ సగముసగము జ్ఞానము సంపాదించుకొన్న విద్యాధికుల భావములకు సంస్కృతి గలిగింపవలయును. ఇట్లు చేసినచో జనసామాన్యము తనంత తానే యున్నతిమార్గము నవలంబించి రాగలరు; శీఘ్రకాలములో మన కళా జ్యోతిని, విజ్ఞానజ్యోతిని మరల వెలిగించుకొని యుజ్జ్వలనము గావించుకొనగలము; నిఖిలప్రపంచ కళా మహోత్సవములో ప్రముఖతమమగు భాగస్వామిత్వము బడయజాలక పోయినను, ప్రముఖులగు భాగస్వాముల స్థానములోనైన నుండగలుగుదుము.

—ఆంధ్రపత్రికనుండి.